క్లుప్తంగా

60 మందికి కంటి అద్దాల పంపిణీ



కొడవలూరు: వైఎస్సార్ కంటి వెలుగు పథకం కింద 60 మందికి మండలంలోని కొత్తవంగల్లు సచివాలయంలో ఉచితంగా కంటి అద్దాలను సచివాలయ కన్వీనర్ వేముల వెంకటేశ్వర్లు చేతుల మీదుగా శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించిన సమయంలో కంటి పరీక్షలు నిర్వహించి 60 మందికి కంటి అద్దాలు అవసరమని గుర్తించారన్నారు. వారికి ప్రభుత్వం ద్వారా ఉచితంగా అద్దాలు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శిఖామణి, ఏఎస్ఎం శాంతి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జంగంవానిదొరువులో ఉచిత వైద్య శిబిరం



ఇందుకూరుపేట: వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా మండలంలోని జంగంవానిదొరువులో శుక్రవారం జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిశోర్ కుమార్, సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన ద్వారా ప్రభుత్వాస్పత్రిలో కాన్పు చేయించుకున్న వారికి రూ.5 వేలు అందించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో హెచ్ఈఓ శ్రీనివాసరావు, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, సూపర్‌వైజర్లు రమ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఫైలేరియా నిర్ధారణ పరీక్షలు

పొదలకూరు: జిల్లా వైద్య, మలేరియా అధికారుల ఆదేశాల మేరకు పట్టణంలోని నర్సారెడ్డికాలనీలో శుక్రవారం ఫైలేరియా వ్యాధి నిర్ధారణ పరీక్షలను ఆరోగ్య సిబ్బంది నిర్వహించారు. పరీక్షల కోసం రక్తనమూనాలను సేకరించారు. కార్యక్రమంలో ఆరోగ్య సహాయకులు రాధాకుమారి, శివప్రసాద్, సచివాలయ ఏఎన్ఎం కృష్ణమ్మ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఎస్సై పోస్టుకు బుచ్చి యువతి ఎంపిక



అపర్ణ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: బుచ్చిరెడ్డిపాళెం మండలానికి చెందిన అపర్ణ ఎస్సై పోస్టుకు ఎంపికైంది. శుక్రవారం ఆమె మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేయాలని ఉన్నా మేనమామ సూచనలతో పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యానని తెలిపారు. ఎస్సైకు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు.

డిగ్రీ పరీక్షలకు 618 మంది గైర్హాజరు

వెంకటాచలం: వీఎస్‌యూ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో శుక్రవారం నిర్వహించిన డిగ్రీ పరీక్షలకు 618 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని వీఎస్‌యూ పరీక్షల నిర్వహణాధికారి ఆర్ ప్రభాకర్ తెలిపారు. ఉదయం నిర్వహించిన ఒకటో సెమిస్టర్ పరీక్షకు 760 మందికి గానూ 685 మంది హాజరయ్యారు. 75 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన మూడో సెమిస్టర్ పరీక్షకు 7,564 మందికి గానూ 7,021 మంది హాజరయ్యారు. 543 మంది గైర్హాజరయ్యారని ఆయన తెలిపారు.

బీసీ హాస్టల్ తనిఖీ

నెల్లూరు రూరల్: సౌత్‌మోపూరులోని బీసీ బాలుర హాస్టల్‌ను బీసీ సంక్షేమాధికారి వెంకటయ్య శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ భవనానికి జరుగుతున్న మరమ్మతులపై ఆరా తీశారు.

వ్యర్థాల తొలగింపు

నెల్లూరు(టౌన్) : ఆజాదీకా అమృత్ మహోత్సవాల్లో భాగంగా పదో ఆంధ్రా నావెల్ యూనిట్ ఆధ్వర్యంలో స్థానిక బీవీనగర్‌లోని కేఎన్నార్ స్కూల్ క్యాడెట్లు దర్గామిట్టలోని స్వర్ణాల చెరువు పరిసర ప్రాంతాల్లో శుక్రవారం వ్యర్థాలను తొలగించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు గుండాల నరేంద్రబాబు, అల్లు ఈశ్వరరావు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

నెల్లూరు(బృందావనం): నగరంలోని బోడిగాడితోట పరిసర ప్రాంతాల్లో 80 కుటుంబాలకు లివింగ్‌వాటర్స్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో దుప్పట్లను శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మినిస్ట్రీస్ సభ్యులు బ్రదర్ జానిజో, విలియం శుభకర్, మహేష్, కల్యాణ్, సాయి పాల్గొన్నారు.

సీఎం ఆశీస్సులతో వేగంగా అభివృద్ధి

• కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



వాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ప్రసన్న తదితరులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో కోవూరు నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టి వేగంగా పూర్తి చేస్తున్నాని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెంలో అంబేడ్కర్ విగ్రహం నుంచి గాంధీనగర్ రోడ్డు వరకు రూ.కోటి నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి శుక్రవారం ఆయన భూమి పూజ చేశారు. అనంతరం రూ.కోటి నిధులతో ఇస్కపాళెం స్మార్ట్ వాటర్ డ్రైన్ ప్రొటెక్షన్ వాల్స్ నిర్మాణానికి (బిట్-1, బిట్-2) శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు అడిగిన సీసీ రోడ్డు, డ్రెయిన్ ప్రొటెక్షన్ వాల్స్ నిర్మాణాలకు శ్రీకారం చుట్టడం ఆనందంగా ఉందన్నారు. ప్రజల అభీష్టం మేరకే వైఎస్సార్‌సీపీ పాలన ఉంటుందన్నారు. నియోజకర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. అనంతరం పాడి రైతులకు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో దాణామృతం పంపిణీ చేశారు.

• నగర పంచాయతీ పరిధిలోని చెన్నూరురోడ్డులో ఆప్కో వస్త్రాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ చేనేతలను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. చేనేత వస్త్రాలకు మార్కెటింగ్ కల్పించే దిశగా ఆప్కో వస్త్ర దుకాణం ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రజలకు చేరువ చేసేందుకు 30 శాతం ప్రభుత్వం రాయితీ ఇస్తోందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, డీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, అధికారులు, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

కనుపూరు కాలువకు సాగునీటి విడుదల



నీటి విడుదల కోసం పూజలు నిర్వహిస్తున్న డీఈ

పొదలకూరు: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి డాక్టర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదేశాల మేరకు కనుపూరు కాలువకు సంగం బ్యారేజీ నుంచి శుక్రవారం ఇంజినీరింగ్ అధికారులు రైతులతో కలిసి సాగునీటిని విడుదల చేశారు. కాలువకు 200 క్యూసెక్కులను విడుదల చేసినట్లు కనుపూరు కాలువ డీఈ గురజాల వెల్లడించారు. దీంతో పొదలకూరు మండలంతోపాటు, నెల్లూరు రూరల్, వెంకటాచలం మండలాల్లో వరిసాగుకు అవసరమైన నీరు అందుతుందన్నారు. అవసరమైతే నీటి విడుదలను స్వల్పంగా పెంచుతామన్నారు. కార్యక్రమంలో నేదురుమల్లి, వెలికంటిపాళెం సర్పంచ్‌లు ఉడతా రమేష్, వెంకటరమణయ్య, సూరాయపాళెం మాజీ సర్పంచ్ ఎం.మల్లారెడ్డి, ఏఈ బాలసుబ్రహ్మణ్యం, రైతులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ



కార్డు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడ గ్రామంలో శుక్రవారం డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కొత్త కార్డులను కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకంపై ప్రత్యేక శ్రద్ధ చూపారన్నారు. వైద్య పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు పెంచి డిజిటల్ కార్డులు అందించడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో కార్యక్రమంలో డీఎల్‌డీఏ చైర్మన్ విజయ్‌కుమార్, పీహెచ్‌సీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, వలంటీర్లు, నాయకులు మురళీకృష్ణ, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గీతా జయంతి వేడుకలు నేడు



ఆహ్వానపత్రికలను ఆవిష్కరించిన నజీర్‌బాషా గురూజీ

నెల్లూరు(బృందావనం) : నగరంలోని సుజాతమ్మ కాలనీలో ఉన్న శ్రీరాధాకృష్ణ ధ్యాన మందిరంలో గీతా జయంతి వేడుకలను శనివారం నిర్వహిస్తున్నట్లు గీతా వైభవ ట్రస్ట్ చైర్మన్ షేక్.నజీర్‌బాషా గురూజీ తెలిపారు. మూలాపేటలోని శివగిరి కాలనీలో ఉన్న ట్రస్ట్ కార్యాలయంలో 'గీతా వైభవమే భారత వైభవం' ఆహ్వానపత్రికలను ఆయన శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధ్యాత్మిక ప్రగతి కోసం గీతా వైభవ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 1,500 మంది విద్యార్థులతో వివిధ కార్యక్రమాలను వేడుకగా చేపట్టనున్నట్లు వివరించారు. రామ్‌నగర్‌లోని శబరి శ్రీరామక్షేత్రం నుంచి ధ్యాన మందిరం వరకు నగర సంకీర్తన జరుగుతుందన్నారు. సమావేశంలో ట్రస్ట్ కోశాధికారి పి.రాజారామ్, సభ్యులు మెంటా లక్ష్మీకుమారి, టి.ప్రభావతి, జి.లీలావతి, ఎన్వీ సుశీల, టి.మహాలక్ష్మి పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి ముస్తాబు



స్వామివారి విద్యుత్ కటౌట్

నెల్లూరు(బృందావనం) : వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని (ముక్కోటి ఏకాదశి) పురస్కరించుకుని రంగనాయకులపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానం ముస్తాబైంది. అధిక సంఖ్యలో వచ్చే భక్తుల కోసం విస్తృత ఏర్పాట్లు చేసినట్లు దేవస్థానం ఈఓ డబ్బుగుంట వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. భక్తుల కోసం ఉచిత, రూ.50, రూ.100 టిక్కెట్లతో స్వామివారి ఉత్తర ద్వారం ద్వారా దర్శించుకునేందుకు బ్యారికేడ్లు ఏర్పాట్లు చేశామన్నారు. సిటీ ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్‌కుమార్ సూచనల మేరకు గతంలో రూ.500 టికెట్‌ను రూ.100గా బదలాయించామన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో స్వామివారి చిత్రాలతో విద్యుద్దీపాల కటౌట్‌లను ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామివార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులు కావాలన్నారు.

విద్యార్థులకు అభినందన

నెల్లూరు(పొగతోట) : రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు ఎంపికైన సౌత్‌మోపూరు పాఠశాల విద్యార్థులను జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ శుక్రవారం అభినందించారు. నగరంలోని జెడ్పీ కార్యాలయంలో విద్యార్థులు రిషిత, షణ్ముఖప్రియ, రంజిత్‌కుమార్‌లను ఆమె ప్రత్యేకంగా అభినందించి, రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్ఎం షేక్.అన్వర్ హుస్సేన్, సైన్స్ టీచర్ జి.శ్రీనివాస్, పీడీ నాగేంద్రరావు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం

సంగం: మండలంలోని కామాక్షిదేవి సమేత సంగమేశ్వరస్వామి ఆలయంలో ఈఓ వరప్రసాద్ అధ్యక్షతన నూతన ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఆలయ చైర్మన్‌గా పెరుమాళ్ల రవీంద్రబాబు పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆలయ అధికారులు, వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ కంటాబత్తిన రఘునాథ్‌రెడ్డితోపాటు పలువురు నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు అనుమాలశెట్టి రామారావు, రాంబాబు, గాంధీజన సంఘం సర్పంచ్ మాణికల చందన్‌కుమార్, నరేష్, జహంగీర్, జనార్దన్‌రెడ్డి, చంద్రమౌళి తదితరులు ఉన్నారు.

ఆటోను ఢీకొన్న కారు

• ఇద్దరికి గాయాలు

వెంకటాచలం: కారు టైరు పంక్చర్ కావడంతో అదుపుతప్పి ఆటోను ఢీకొన్న ఘటన మండలంలోని గొలగమూడి సమీపంలో శుక్రవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. నెల్లూరు వైపు నుంచి ఆటో వస్తోంది. అదే సమయంలో గొలగమూడి వైపు నుంచి నెల్లూరుకు వెళ్తున్న కారు గొలగమూడి సమీపంలో పెట్రోల్ బంకు దాటిన తర్వాత టైరు పంక్చరైంది. దీంతో కారు ఆటోను ఢీకొంది. ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి. వారిని వెంటనే మరొక కారులో చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.

తహసీల్దార్ విచారణ

ఇందుకూరుపేట: మండలంలోని నరసాపురం పార్వతమ్మ దొరువు ఆక్రమణపై తహసీల్దార్ సుబ్బయ్య శుక్రవారం విచారణ చేపట్టారు. దొరువును ఆక్రమించారంటూ స్థానికులు గురువారం నిరసన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన నరసాపురం విచ్చేసి వివరాలు ఆరాతీశారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఈనెల 26న శోభాయాత్ర

మనుబోలు: మండల కేంద్రంలో సమరత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీన శోభాయాత్ర నిర్వహించనున్నట్లు సమరత సేవా ఫౌండేషన్ జిల్లా సహాయ కన్వీనర్ గణపతి తెలిపారు. శుక్రవారం ఆయన మనుబోలులో వివరాలు వెల్లడించారు. 26న ఉదయం 10 గంటలకు మనుబోలు లోని వైఎస్సార్ సర్కిల్ నుంచి యాత్ర ప్రారంభమవుతుందన్నారు. ఆయన వెంట ఫౌండేషన్ మండల కన్వీనర్ ఆలూరు రాము ఉన్నారు.

విద్యార్థులకు అవగాహన

పొదలకూరు: స్థానిక విజ్ఞాన్ జూనియర్ కాలేజీలో శుక్రవారం కుష్ఠు, హెచ్ఐవీ తదితర వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పొదలకూరు సెక్టార్ డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ మోహన్‌రావు మాట్లాడుతూ కుష్ఠు రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈనెల 27 నుంచి జనవరి 12వ తేదీ వరకు కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించే ప్రక్రియ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యారోగ్య శాఖ ఉద్యోగులు, కాలేజీ ప్రిన్సిపల్ సుబ్బారావు, అకడమిక్ ఇన్‌చార్జి వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తిని మరింత పెంపొందించుకోవాలి

కోవూరు: విద్యార్థులు ఎన్‌సీసీలో చేరి దేశభక్తిని మరింత పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని లెఫ్టినెంట్ కమాండింగ్ ఆఫీసర్ వినయ్ రామచంద్రన్ అన్నారు. కోవూరు మండలం నేతాజీ నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం పది ఆంధ్రా నేషనల్ యూనిట్ ఎన్‌సీసీ రైజింగ్ డే, ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీలో చేరడం వల్ల విద్యార్థులకు అనేక ఉపయోగాలు ఉన్నాయన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మీప్రసూన మాట్లాడుతూ తమ కళాశాలలో ఎన్‌సీసీ రైజింగ్ డే ఏర్పాటుకు సహకరించిన కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యుడు నిరంజన్‌బాబురెడ్డి, రామచంద్రన్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.రాంప్రసాద్, ఎన్‌సీసీ కేర్ టేకర్ పి.సురేంద్ర పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'కు ఏర్పాట్లు పూర్తి

కోవూరు: మండలంలో ఈనెల 26వ తేదీ నుంచి ఆడుదాం ఆంధ్రా క్రీడల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని ఎంపీడీఓ శ్రీహరి అన్నారు. స్థానిక పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో క్రీడా ప్రాంగణాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొత్తం 16 సచివాలయాలకు సంబంధించి 160 మెన్స్ టీంలు, 160 ఉమెన్స్ టీంలు ఇప్పటికే ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేశాయన్నారు. మండలంలో 9 మైదానాలను ఎంపిక చేశామన్నారు. స్నేహపూర్వక వాతావరణంలో క్రీడలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ వెంకటరమణయ్య, పీఈటీ వెంకటసుబ్బమ్మ, ప్రధానోపాధ్యాయుడు నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

పొదలకూరు: రైతులు బ్యాంక్‌లు అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని గూడూరు ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ (క్రెడిట్, అగ్రి) శరత్‌బాబు కోరారు. జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శరత్‌బాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత రైతులు క్రాప్ లోన్ మాత్రమే తీసుకుంటున్నారని, అన్ని రకాల సేవలను ఉపయోగించుకోవడం లేదన్నారు. మేనేజర్ పీఎస్ రాజు మాట్లాడుతూ క్రాప్ లోన్లతోపాటు పలు రకాల రాయితీ రుణాలను అందజేస్తున్నట్లు తెలిపారు. సెల్ఫ్ హెల్ప్ గ్రూపుల అభివృద్ధి కోసం ప్రభుత్వాలు సంక్షేమ పథకాలను అందజేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్ నరసింహస్వామి, బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్లు చిరంజీవి, రవితేజ, వంశీ, రైతులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో జాతీయ గణిత దినోత్సవం



మనుబోలు: రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



ముత్తుకూరులో..



కొడవలూరులో..

ముత్తుకూరు: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలో శుక్రవారం శ్రీనివాస రామానుజన్ జన్మదినోత్సవాన్ని, జాతీయ గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. అదానీ వరల్డ్ స్కూల్లో కార్యక్రమం జరిగింది. విద్యార్థులు తయారు చేసిన పలు గణిత నమూనాలను ప్రిన్సిపల్ సత్యనారాయణ, ఉపాధ్యాయులు పరిశీలించారు. క్విజ్ పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. సుబ్బారెడ్డిపాళెం యూపీ స్కూల్లో మ్యాథ్స్ టీచర్ జె.జనార్దన్‌ను హెచ్ఎం సుబ్బరత్నమ్మ, ఉపాధ్యాయులు పద్మారత్నం, సాయి, రమణమ్మ తదితరులు సత్కరించారు.

➡ కొడవలూరు: జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా శుక్రవారం నార్తురాజుపాళెంలోని శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ డాక్టర్ పి.గుణశేఖర్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్య గణితంతో ముడిపడి ఉందన్నారు. ఇందులో రాణించాలంటే మ్యాథ్స్‌పై పట్టు సాధించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన, పోస్టర్ ప్రజెంటేషన్ తదితర పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ వి.అనిల్ కుమార్, అనుబంధ కళాశాలల ప్రిన్సిపల్స్ ఎ.హజరత్తయ్య, సి.మధుసూదన్‌రావు, గణిత విభాగాధిపతి సీహెచ్ చంద్రశేఖర్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

➡ మనుబోలు: గణితమంటే భయపడొద్దని మనుబోలు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డేవిడ్ అన్నారు. జాతీయ గణిత దినోత్సవాన్ని శుక్రవారం పాఠశాలలో నిర్వహించారు. మ్యాథ్స్ క్లబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీనివాస రామానుజన్ బహుముఖ ప్రజ్ఞాశాలి అన్నారు. గణితమంటే చాలామంది విద్యార్థులు భయపడుతుంటారని, అయితే ఇష్టంతో సాధన చేస్తే చాలా సులభమైన సబ్జెక్ట్ అన్నారు. పిల్లలు తయారు చేసిన మోడల్స్‌ను ప్రదర్శించారు. గతేడాది మ్యాథ్స్‌లో 90 శాతం పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు టీచర్ శ్యామల జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మురళీధర్‌రెడ్డి, జ్యోతిలక్ష్మి, షావలీ, రాధయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడలపై ప్రత్యేక దృష్టి సారించాలి

• ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



మస్కట్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే ప్రసన్న

కోవూరు: విద్యార్థులు చదువుపైనే కాకుండా క్రీడలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం ఆడుదాం ఆంధ్రా పోటీలకు సంబంధించిన మస్కట్‌ను ఆవిష్కరించారు. అనంతరం వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ క్రీడా పోటీలకు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారన్నారు. డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ సాంబశివారెడ్డి, జీఎం ఇండస్ట్రీస్ సుధాకర్ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యులు నిరంజన్‌బాబురెడ్డి, కోవూరు ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, నల్లపరెడ్డి రజిత్‌కుమార్‌రెడ్డి, డీఎల్‌డీఏ డైరెక్టర్ దినేష్‌రెడ్డి, ఎంపీపీ టి.పార్వతి, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, పడుగుపాడు సొసైటీ చైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి, జలజీవన్ మిషన్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, రాష్ట్ర బొందిలి కార్పొరేషన్ చైర్మన్ కిశోర్ సింగ్, యువజన విభాగం కార్యదర్శి సాయియశ్వంత్‌రెడ్డి, జగదీష్, ఉపసర్పంచ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందజేత



నెల్లూరు(బృందావనం): క్రిస్మస్ వేడుకల్లో భాగంగా నగరంలోని బాప్టిస్ట్ చర్చి డొనీహాల్లో పిల్లలకు, అనారోగ్యంతో బాధపడేవారికి శుక్రవారం పౌష్టికాహారం, దుప్పట్లు అందజేశారు. తొలుత సంఘ కాపరి రెవ. కంది శ్యామ్‌సన్‌కుమార్ వాక్యోపదేశం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి గుర్రం అరుణ్‌కుమార్, ఎవాంజలిజమ్ డైరెక్టర్ గంటా జార్జి స్టీవెన్సన్, సంఘ పెద్దలు ప్రభుదాస్‌పాల్, వర కుమార్, పాస్టర్ శ్యామ్‌కుమార్, హుల్దా శ్యాంసన్ బ్లెస్సింగ్‌టన్, విజయపాల్, దినేష్, లాబాన్, దేవప్రసాద్, ఏలియా పాల్గొన్నారు.

పెళ్లింట విషాదం



సుబ్రహ్మణ్యం (ఫైల్)

సంగం: ఓ తండ్రి కుమార్తెకు వివాహం చేసి ఆనందంగా ఉన్నాడు. అయితే కుమార్తె 16 రోజుల పండగ రోజే గుండెపోటుతో మృతిచెందాడు. దీంతో వేడుక జరిగిన ఇంట్లో విషాదం నెలకొంది. ఈ ఘటన సంగం శివాజీ సెంటర్‌లో శుక్రవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. సంగం శివాజీ సెంటర్‌కు చెందిన అవ్వారి సుబ్రహ్మణ్యం (45) స్థానికంగా టిఫిన్ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈనెల 17వ తేదీన కుమార్తెకు వివాహం చేశాడు. అయితే పచ్చటి తోరణాలతో కళకళలాడిన ఆ ఇంట్లో గురువారం 16 రోజుల పండగ జరగాల్సి ఉంది. సుబ్రహ్మణ్యం ఒక్కసారిగా కుప్పకూలిపోవడంతో కుటుంబసభ్యులు ఆత్మకూరు వైద్యశాలకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు నెల్లూరుకు తరలించాలని సూచించారు. నెల్లూరులో ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. ఇంటి పెద్ద మృతిచెందడంతో ఆ కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా రోదిస్తున్నారు.

క్రీడా పోటీల ఏర్పాట్ల పరిశీలన

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్రా' టోర్నమెంట్ ఏర్పాట్లను నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఇందులో భాగంగా స్థానిక ఏసీ సుబ్బారెడ్డి క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న పనులను అధికారులతో కలిసి కమిషనర్ శుక్రవారం పరిశీలించారు. ఈనెల 26వ తేదీ నుంచి జరుగనున్న పోటీల్లో క్రీడాకారులు, వీక్షకులకు అన్ని వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇండోర్, ఔట్‌డోర్ క్రీడల నిర్వహణకు అవసరమైన క్రీడా పరికరాలు, మైదానాల్లో ఏర్పాట్లు, స్టేడియం ప్రాంగణంలో పారిశుద్ధ్య నిర్వహణ, క్రీడాకారులకు అవసరమైన వసతులు, రవాణా, ఆహార పానీయాలు, భద్రత తదితర అంశాలను పటిష్టంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ శర్మద, ఇంజినీరింగ్ ఎస్ఈ సంపత్ కుమార్, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటరమణ పాల్గొన్నారు.